
సాక్షి
రాజన్న సిరిసిల్ల

హైదరాబాద్‌లో శనివారం మహాలక్ష్మి పథకం ప్రారంభోత్సవంలో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ప్రభుత్వం కల్పించిన ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.



ఆదివారం । 10 । డిసెంబర్ । 2023



- 8లో

అలుపెరుగని పరుగు..

సండే స్పెషల్

ఏడు పదుల వయసులోనూ అలసిపోకుండా పరుగులీస్తోంది. నిండైన ఆత్మవిశ్వాసంతో జాతీయ, అంతర్జాతీయ వేదికలపై పతకాలు సాధిస్తోంది. పరుగులీసిన ప్రతీ చోట పతకం ఖాయం చేసుకుంటుంది. ముప్పై ఏళ్లకే ఏమి సాధించలేకపోయామని నిరాశ.. నిస్పృహలకు గురయ్యే యువతకు ఆదర్శంగా నిలుస్తోంది రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన వెటరన్ అథ్లెట్ టమటం రామానుజమ్మ. ఇటీవల మలేషియాలో జరిగిన పోటీల్లో డెబ్బై ఏళ్ల వయసులోనూ పరుగులీసి రజత పతకం సాధించింది. అంతర్జాతీయ వేదికలపై భారతదేశ గౌరవాన్ని సమున్నతస్థానంలో నిలుపుతున్న రామానుజమ్మపై స్పెషల్ స్టోరీ.. - సిరిసిల్ల

అండగా ఉంటాం | అభివృద్ధి చేస్తాం

కార్యాచరణతో ముందుకు



మంథని ప్రాంత అభివృద్ధి, సంక్షేమంపై ప్రణాళికా బద్ధమైన కార్యాచరణతో ముందుకు సాగుత. పెండింగ్ పనులతో పాటు మేనిఫెస్టోలో పెట్టిన ప్రధానమైన అంశాలను నియోజకవర్గానికి పెద్ద స్థాయిలో తీసుకువచ్చే విధంగా కృషిచేస్తా. నిరంతరం నా ప్రయత్నం కొనసాగుతుంది. ఈప్రాంత సంక్షేమం, అభివృద్ధి ప్రధాన ధ్యేయంగా ముందుకెళ్తా.

– దుద్దిళ్ల శ్రీధర్, మంథని ఎమ్మెల్యే, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి



- ప్రమాణ స్వీకారం చేసిన 11 మంది జిల్లా ఎమ్మెల్యేలు
- సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తామని ప్రతిన
- వివిధ కారణాలతో కార్యక్రమానికి కేటీఆర్, పాడి కౌశిక్ దూరం
- సింగరేణి కార్మికుని వేషధారణతో అసెంబ్లీకి మక్కాన్ సింగ్
- తిరిగి పాత జిల్లాకే దక్కిన ఐటీ, బీసీ శాఖలు

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. అసెంబ్లీలో లాంఛనంగా జరిగిన ఈ కార్యక్రమంలో పాత జిల్లాకు చెందిన 11 మంది ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు. వీరిలో ఎనిమిది మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కాగా, ముగ్గురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు. ప్రమాణ స్వీకారం ముగిసిన తర్వాత ఎమ్మెల్యేలను 'సాక్షి' పలకరించింది. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేరుస్తామని.. పార్టీ మేనిఫెస్టో అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. నియోజకవర్గ సమస్యలకు పెద్దపీట వేస్తామని స్పష్టంచేశారు. ఉమ్మడి జిల్లాలోని 13 మంది ఎమ్మెల్యేలలో కోరుట్ల నుంచి సంజయ్, ధర్మపురి నుంచి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రామగుండం నుంచి మక్కాన్ సింగ్, వేములవాడ నుంచి ఆది శ్రీనివాస్, చొప్పదండి నుంచి మేడిపల్లి సత్యం, మానకొండూరు నుంచి కవ్వంపల్లి సత్యనారాయణ, హుజూరాబాద్ నుంచి పాడి కౌశిక్‌రెడ్డి, హుస్నాబాద్ నుంచి పొన్నం ప్రభాకర్ తొలిసారి అసెంబ్లీకి ఎన్నికయ్యారు. మంథని నుంచి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కరీంనగర్ నుంచి గంగుల కమలాకర్, పెద్దపల్లి నుంచి చింతకుంట విజయరమణారావుకు ఎమ్మెల్యేలుగా పనిచేసిన అనుభవం ఉంది. శ్రీధర్‌బాబు, గంగుల కమలాకర్ మంత్రులుగా వ్యవహరించిన విషయం తెలిసిందే. కాగా.. వ్యక్తిగత కారణాలతో సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్, సాంకేతిక సమస్యలతో పాడి కౌశిక్‌రెడ్డి ప్రమాణ స్వీకారానికి దూరంగా ఉన్నారు. ఇక ఉమ్మడి జిల్లా నుంచి ఇద్దరికి మంత్రి పదవులు దక్కాయి. మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుకు ఐటీ శాఖ కేటాయించారు. అయితే గతంలో ఇదే శాఖను సిరిసిల్ల నుంచి ఎమ్మెల్యేగా వ్యవహరించిన కేటీఆర్ నిర్వహించారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే పొన్నం ప్రభాకర్‌కు బీసీ సంక్షేమశాఖ వరించింది. ఈ శాఖను గతంలో కరీంనగర్ ఎమ్మెల్యేగా గెలిచిన గంగుల కమలాకర్ నిర్వహించారు. ఏదేమైనా రెండు కీలక శాఖలు తిరిగి పాత జిల్లాకే దక్కడం విశేషం.

తట్టా చెమ్మస్‌తో.. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

తట్టా చెమ్మస్‌తో బ్లూకలర్ డ్రెస్‌తో రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్ ఠాకూర్ అసెంబ్లీకి రావడం అందరి దృష్టిని ఆకర్షించారు. తాను కూడా సింగరేణి కార్మికుడినని గుర్తుచేస్తూ ఎమ్మెల్యే అసెంబ్లీకి రావడం కార్మికులు హర్షం వ్యక్తంచేశారు. అవే దుస్తులతో అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేయడాన్ని రామగుండం ప్రజలు, సింగరేణి బెల్ట్ కార్మికులు స్వాగతించారు.

హామీలు నెరవేరుస్తా..



అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీల అమలు మొదలైంది. ఆరు గ్యారెంటీలలో కీలకమైన మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచాం. హుస్నాబాద్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం. నన్ను గెలిపించిన ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటా.

– పొన్నం ప్రభాకర్, హుస్నాబాద్ ఎమ్మెల్యే, బీసీ సంక్షేమశాఖ మంత్రి

సమస్యలు పరిష్కరిస్తా



పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తా. ప్రజా అవసరాలు తీర్చేందుకు ప్రాధాన్యమిస్తా. బస్ డిపో ఏర్పాటు, ప్రధాన కూరగాయల మార్కెట్ అభివృద్ధి తదితర సమస్యలు పరిష్కరిస్తా. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాల ఫలాలను అందిస్తా.

– విజయరమణారావు, పెద్దపల్లి ఎమ్మెల్యే

కార్మికులకు రక్షణగా ఉంటా



సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా. ఏ సమస్య వచ్చినా అండగా ఉంటా. రామగుండం నియోజకవర్గ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా. సింగరేణితోపాటు స్థానిక సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తా. ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తా.

– రాజ్ ఠాకూర్, రామగుండం ఎమ్మెల్యే

యాదాద్రి తరహాలో చేస్తా..



మేడారం, కాళేశ్వరం లింక్–2 ద్వారా ఈప్రాంత రైతులకు పూర్తిస్థాయిలో సాగు, తాగునీరు వచ్చేలా చూస్తా. జంగల్‌నాలా ప్రాజెక్టుకు లింక్–2 ద్వారా తూము ఏర్పాటు చేస్తాం. ధర్మపురి పట్టణంలో 100 పడకల ఆస్పత్రి ఏర్పాటు, ధర్మపురిలో బస్‌డిపో ఏర్పాటు రెవెన్యూ డివిజన్ హోదా, యాదాద్రి తరహాలో అభివృద్ధికి కృషి చేస్తా.

– అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ధర్మపురి ఎమ్మెల్యే

ఫుడ్ ఇండస్ట్రీ ఏర్పాటుకు కృషి



జగిత్యాల నియోజకవర్గంలో దాదాపు ఇప్పటికే వెయ్యికోట్లతో అభివృద్ధి చేసుకున్నాం. ఫుడ్ ఇండస్ట్రీతో పాటు పెండింగ్‌లో ఉన్న మెడికల్ కాలేజీ పూర్తిస్థాయి పనులు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తా. సారంగాపూర్ మండలం గొల్ల వాగు ప్రాజెక్టు పూర్తయింది. అటవీశాఖ అనుమతితో గేట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. మెజార్టీ గ్రామాల్లో సీసీ రోడ్లు వేశాం, వేయని వాటిలోనూ పూర్తి చేస్తాం.

– సంజయ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే

పరిశ్రమల స్థాపనకు..



కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తాం. స్థానికంగా ఉపాధి అవకాశాలు పెంచి గల్ఫ్ వలసలు నివారించడంపై దృష్టి పెడతా. మున్సిపాలిటీలను ఇప్పటికే అగ్రగామిగా నిలపాం. వాటిని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తాం. నియోజకవర్గంలో పీజీ కళాశాలలు, సీటీ స్కాన్ సెంటర్, పేదలకు ఇళ్ల నిర్మాణం, ఫుడ్ ప్రాసెసింగ్ జోన్స్ ఏర్పాటు చేస్తాం.

– డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, కోరుట్ల ఎమ్మెల్యే

టెంపుల్ సిటీగా మారుస్తా..



అభివృద్ధి, సంక్షేమంపై దృష్టిపెడతా. వేములవాడ నగరాన్ని టెంపుల్ సిటీగా మార్చేందుకు కృషి చేస్తా. నియోజకవర్గ సమస్యల తోపాటు ఆలయ అభివృద్ధికి పెద్దపీట వేస్తాం. స్థానిక సమస్యలపై అవగాహన మేరకు దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరిస్తా. ప్రజలు నాపై పెట్టుకున్న ఆశలను నిలబెట్టుకుంటా.

– ఆది శ్రీనివాస్, వేములవాడ ఎమ్మెల్యే

అభివృద్ధే ధ్యేయం



ఎన్నికల్లో నన్ను గెలిపించిన చొప్పదండి ప్రజలకు రుణపడి ఉంటాను. పార్టీ మేనిఫెస్టోలో పెట్టిన హామీలు నెరవేర్చడం ఇప్పటికే మొదలైంది. స్థానికంగా ఇచ్చిన హామీలపై దృష్టి పెడతాం. ప్రాధాన్య క్రమంలో అన్నింటినీ పరిష్కరిస్తాం. మౌలిక సదుపాయాలతోపాటు అన్నిరంగాల్లో చొప్పదండి నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తాం.

– మేడిపల్లి సత్యం, చొప్పదండి ఎమ్మెల్యే

నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతా..



రహదారుల అభివృద్ధి కోసం నిధులు తీసుకొస్తా. నియోజకవర్గంలో పదేళ్లగా ఇళ్లు లేకుండా ఇబ్బందులు పడుతున్న పేదలకు ఇళ్ల స్థలాలతోపాటు ఇంటి నిర్మాణాలకు ప్రాధాన్యమిస్తా. తాగు సాగునీరు సదుపాయాలతోపాట మౌలిక వసతుల కల్పనకు కషి చేస్తా. గ్రామాల్లో సీసీ రోడ్లు కల్వర్టుల నిర్మాణానికి కృషి చేస్తా.

– కవ్వంపల్లి సత్యనారాయణ, మానకొండూర్ ఎమ్మెల్యే

భావితరాల కోసం పాటుపడతా



కరీంనగర్‌ను అన్ని రంగాల్లో తీర్చిదిద్దా. స్మార్ట్‌సిటీ, ఎంఆర్ఎఫ్ ప్రాజెక్టు, కేబుల్ బ్రిడ్జితో పర్యాటక అభివృద్ధికి పెద్దపీట వేశాం. టీటీడీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న వేంకటేశ్వరాలయం పూర్తిచేసి ఆధ్యాత్మిక పర్యాటక అభివృద్ధికి కృషిచేస్తాం. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని మరిన్ని కొత్త పనులు ప్రారంభిస్తా.

– గంగుల కమలాకర్, కరీంనగర్ ఎమ్మెల్యే

న్యూస్‌రీల్

ఆరు నెలల్లో కాంగ్రెస్‌లోకి హరీశ్‌రావు

- కాంగ్రెస్ సిరిసిల్ల ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి



ముస్తాబాద్‌లో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

ముస్తాబాద్(సిరిసిల్ల): గెలుపోటములతో సంబంధం లేకుండా ఇక్కడే ప్రజలతోనే ఉన్నానని కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ముస్తాబాద్‌లో శనివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, కవిత ఆరు నెలల్లో కాంగ్రెస్‌లో చేరుతారన్నారు. రాష్ట్రంలో పదేళ్ల బీఆర్ఎస్ అరాచక, నియంతపాలన చేశారన్నారు. కాంగ్రెస్ గెలుపుతో ప్రజల్లో సంతోషం కనిపిస్తుందని తెలిపారు. ఎన్నికల సమయంలో వారానికి రెండు రోజులు ఇక్కడే ఉంటానన్న ఎమ్మెల్యే కేటీఆర్ పదేళ్లు ఎందుకు లేడని ప్రశ్నించారు. నేను ఎమ్మెల్యేగా ఓడిపోయినప్పటికీ వారానికి నాలుగుసార్లు ఇక్కడే ఉన్నానని గుర్తుచేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు సైనికుల వలే పనిచేశారని కొనియాడారు. పార్టీ మండలాధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, నాయకులు చక్రధర్‌రెడ్డి, గడ్డం నర్సయ్య, రాజిరెడ్డి, మిర్యాల్‌కార్ శ్రీనివాస్, పెద్దిగారి శ్రీనివాస్, వోరగంటి తిరుపతి, బుర్ర రాములు, గజ్జెల రాజు, గుండెల్లి శ్రీనివాస్, రవి, ఆవునూరు రాజిరెడ్డి, బషీర్, కరుణాకర్, నరేశ్, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ అవార్డుల ప్రదానం

- అవార్డులు అందుకోనున్న అనిల్, రమేశ్



అనిల్



రమేశ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన శ్యామంతుల అనిల్, దుంపెన రమేశ్ జాతీయ అవార్డులకు ఎంపికవగా.. విజయవాడలో ఆదివారం అందుకోనున్నారు. అనిల్ గత 20 ఏళ్లుగా కార్వింగ్, పెయింటింగ్‌లలో చూపుతున్న ప్రతిభను గుర్తించి అవార్డుకు ఎంపిక చేశారు. దేశనాయకుల పుట్టిన రోజులు, వర్ధంతిలకు, పండుగల సమయంలో ఆయా వ్యక్తుల చిత్రాలను పుచ్చకాయలపై వేస్తూ పలువురి అభినందనలు పొందుతున్నారు. అలాగే దుంపెన రమేశ్ పన్నెండేళ్లుగా పర్యావరణ పరిరక్షణకు చేస్తున్న కృషిని గుర్తించి అవార్డుకు ఎంపిక చేశారు. ఇప్పటి వరకు తన సొంత ఖర్చులతో 50వేల మొక్కలను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. వీరి సేవలు గుర్తించిన తెలుగు–వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సంస్థ, విశ్వకర్మ గాయత్రి నాట్య కళావేదికలు జాతీయ అవార్డులకు ఎంపిక చేశారు.

రాజీవ్‌ఆరోగ్యశ్రీతో పేదలకు మేలు

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- మహాలక్ష్మి పథకం ప్రారంభం



ఆరోగ్యశ్రీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ

సిరిసిల్ల: రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్యసహాయం పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంపుతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం జీరో చార్జి టికెట్‌ను, ఆరోగ్యశ్రీ లోగో, పోస్టర్‌ను కలెక్టర్ శనివారం ఆవిష్కరించి మాట్లాడారు. ఆస్పత్రుల్లో రాజీవ్‌ఆరోగ్యశ్రీ వైద్యసహాయం పరి మితి పెంపు అమలులోకి వస్తుందని తెలిపారు. ఆరోగ్యశ్రీ కింద ఒక ఫ్యామిలీకి రూ.10 లక్షల వరకు వైద్య సహాయం అందించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎంపానల్డ్ ఆస్పత్రుల్లో రూ.10 లక్షల వరకు చికిత్స ఉచితంగా లభిస్తుంద ని తెలిపారు. జిల్లాలోని 1,73,974 పేద కుటుంబాలకు ఆరోగ్యశ్రీలో లబ్ధి చేకూరనుందని వివరించారు.

మహాలక్ష్మికి శ్రీకారం

మహిళలకు పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యానికి నిర్దేశించిన మహాలక్ష్మి పథకాన్ని సిరిసిల్ల డిపో మేనేజర్ మనోహర్‌తో కలిసి జెండా ఊపి కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలతో కలిసి బస్సులో అంబేడ్కర్ కూడలి నుంచి ఇరగుడు వరకు ప్రయాణించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, జిల్లా రవాణాధికారి వై.కొండల్‌రావు, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ సుమన్ మోహన్‌రావు, జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మురళీధర్‌రావు, జిల్లా ఆస్పత్రి ఆర్ఎంవో సీహెచ్.సంతోష్, జిల్లా ఆరోగ్యశ్రీ టీం లీడర్ తిరుపతి, ట్రాఫిక్ ఇన్‌చార్జి ఎల్.సారయ్య, మెకానికల్ ఇన్‌చార్జి ఏకే ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కలిసివచ్చిన కాంగ్రెస్ నాయకులు

ఆరోగ్యశ్రీ, మహాలక్ష్మి పథకాల ప్రారంభోత్సవంలో కాంగ్రెస్ నాయకులు కేకే మహేందర్‌రెడ్డి, చొప్పదండి ప్రకాశ్, గడ్డం నర్సయ్య, గోలి వెంకటరమణ, కాముని వనిత, మడుపు శ్రీదేవి, సామల పావని, వెలుముల స్వరూప, చందన పాల్గొన్నారు.

90 రోజుల్లో అన్ని హామీలు అమలు

– కాంగ్రెస్ నేత కె.కె.మహేందర్‌రెడ్డి

కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను 90 రోజుల్లో అమలు చేస్తామని, ఇప్పటికే రెండు గ్యారంటీలను అమలులోకి తెచ్చిందని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కె.కె.మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సిరిసిల్లలో శనివారం రాజీవ్ ఆరోగ్యశ్రీ, మహాలక్ష్మి పథకాలను ప్రారంభించిన అనంతరం కె.కె.మహేందర్‌రెడ్డి అంబేద్కర్ సర్కిల్‌లో విలేకరులతో మాట్లాడారు. డిసెంబరు 9న సోనియాగాంధీ జన్మదినం రోజున తెలంగాణ రాష్ట్ర ప్రకటన వెలువడిందని, డిసెంబరు 3న శ్రీకాంతాచారి ఆత్మబలిదానం రోజు ఎన్నికల ఫలితాలు వచ్చాయని గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీలో రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యసేవలు అందించడంతో ఆరోగ్యక్షహక్కుగా మారిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాలు అందించడం ద్వారా వారికి అండగా ప్రభుత్వం ఉందనే విషయాన్ని స్పష్టం చేసిందన్నారు. భౌగోళిక తెలంగాణ కాకుండా.. బతుకుదెరువు తెలంగాణను కాంగ్రెస్ చేస్తుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ నాయకులు చొప్పదండి ప్రకాశ్, నాగుల సత్యనారాయణగౌడ్, వైద్య శివప్రసాద్, ఆకునూరి బాలరాజు, గోలి వెంకటరమణ, గడ్డం నర్సయ్య, గోనె ఎల్లప్ప తదితరులు ఉన్నారు.

తెలంగాణ ప్రదాత సోనియాగాంధీ



సోనియాగాంధీ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కోస్తున్న కేకే మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి మహేందర్‌రెడ్డి
- ఘనంగా సోనియా పుట్టిన రోజు వేడుకలు

సిరిసిల్లటౌన్: కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ చలువతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోనియాగాంధీ పుట్టిన రోజు వేడుకలను శనివారం స్థానిక గాంధీచౌక్‌లో ఘనంగా నిర్వహించారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగున్నర కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షను సోనియాగాంధీ నెరవేర్చిందన్నారు. కొత్తగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందని, అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. జిల్లా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, వైద్య శివప్రసాద్, కణమేని చక్రధర్‌రెడ్డి, యెల్లె లక్ష్మీనారాయణ, మ్యాన ప్రసాద్, గోలి వెంకటరమణ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, మడుపు శ్రీదేవి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సామల పావని, వెల్ముల స్వరూప, ఆడెపు చంద్రకళ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేటీఆర్‌ను కలిసిన జెడ్పీ చైర్‌పర్సన్



సిరిసిల్ల: హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావును రాజన్నసిరిసిల్ల జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ శనివారం కలిశారు. మాజీ సీఎం కేసీఆర్‌కు ఆస్పత్రిలో ఆపరేషన్ జరగ్గా.. కేటీఆర్‌ను కలిసి.. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్ నాయకులు న్యాలకొండ రాఘవరెడ్డి తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు ఆంగ్ల బోధన తరగతులు

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు శనివారం జిల్లా కేంద్రంలోని గీతానగర్ ప్రభుత్వ పాఠశాలలో ఉచిత ఆంగ్ల బోధన తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ 40 రోజులపాటు ఆన్‌లైన్ విధానంలో జరగనున్నాయని విల్ టు కెన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ డైరెక్టర్ రామేశ్వర్‌గౌడ్ తెలిపారు. రాష్ట్ర పరిశోధన విద్యాసంస్థ సహకారంతో ఈ శిక్షణ కొనసాగిస్తామన్నారు. శనివారం నాటి బోధనకు 200 మంది టీచర్లు హాజరయ్యారు.

15న నేషనల్ గేమ్స్ సెలక్షన్స్

సిరిసిల్లటౌన్: నేషనల్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను ఈనెల 15న సిరిసిల్లలోని మినీస్టేడియంలో నిర్వహిస్తున్నట్లు సెస్ చైర్మన్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చిక్కాల రామారావు శనివారం ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 16 బాల, బాలికల విభాగాల్లో ఎంపికైన వారిని జనవరిలో గుజరాత్‌లో జరిగే నేషనల్ మీట్ పోటీలకు పంపించనున్నట్లు వివరించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు తహసీల్దార్ జారీ చేసిన పుట్టిన రోజు ధ్రువీకరణపత్రం, పదోతరగతి సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

సత్యనారాయణ వ్రతం



ముస్తాబాద్(సిరిసిల్ల): పోతుగల్ శ్రీశివకేశవ ఆలయంలో కార్తీకమాసం శనివారం సందర్భంగా సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. అర్చకులు శివచరణ్‌శర్మ, సునీల్ ఆధ్వర్యంలో ఈ పూజలు చేశారు.

గోశాలకు కోడెలు



వేములవాడఅర్బన్: తిప్పాపూర్‌లోని రాజన్న గోశాలలోని 20 కోడెలను మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం పెద్దనాగారం గ్రామానికి చెందిన పార్వతీ గోశాలకు అందజేశారు.

అలుపెరుగని పరుగు..

- ఏడు పదుల వయసులోనూ పరుగెడుతున్న రామానుజమ్మ
- ఇటీవల మలేషియాలో రజతం సొంతం
- వంద పతకాలు సాధించిన అమ్మ
- పరుగెత్తితే పతకం ఖాయం



సాధించిన పతకాలతో రామానుజమ్మ

సిరిసిల్ల: రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన వెటరన్ అథ్లెట్ టమటం రామానుజమ్మ రెండున్నర దశాబ్దాలుగా జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలతోపాటు అంతర్జాతీయ వేదికలపై పరుగుతీస్తూ ప్రతిభ కనబరుస్తోంది. మాస్టర్ అథ్లెట్‌గా పేరుపొందిన రామానుజమ్మ వందకుపైగా పతకాలు సాధించింది. పరుగుపందెంతోపాటు యోగా, కరాటేలోనూ ప్రతిభ కనబరుస్తుంది. పదోతరగతి వరకు చదువుకున్న రామానుజమ్మ పదేళ్ల ప్రాయం నుంచే క్రీడల్లో ఆసక్తి పెంచుకోగా.. భర్త భూషయ్య సహకారంతో మొదటిసారి 1995లో మాస్టర్ అథ్లెట్‌గా పరుగుపందెంలో పాల్గొంది. ప్రైవేటు ఉద్యోగం చేస్తూనే ఆటలపై ఆసక్తి పెంచుకొని మహిళాలోకానికి ఆదర్శంగా నిలిచింది. 1996లో కరీంనగర్‌లో జరిగిన ఆంధ్రప్రదేశ్ వెటరన్ అసోసియేషన్ పోటీల్లో వందమీటర్ల పరుగుపందెంలో బంగారు పతకం సాధించింది. 70 ఏళ్ల వయసులో ఇప్పటి వరకు రామానుజమ్మ పరుగుపందెం, జావలింగ్ త్రో, షాట్‌పుట్ క్రీడల్లో 60 బంగారు పతకాలు, 44 వెండి పతకాలతోపాటు మరెన్నో ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారాలను సాధించింది. హర్యానాలో జరిగిన మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని దేశం తరఫున మలేషియా వెళ్లేందుకు ఎంపికైంది.

సమాజసేవలో..

- రామానుజమ్మ తన కళ్లతోపాటు దేహాన్ని సైతం మరణానంతరం కరీంనగర్‌లోని చల్మెడ వైద్యవిజ్ఞాన సంస్థకు లయన్స్‌క్లబ్ ద్వారా దానం చేసేందుకు ముందుకొచ్చింది. దేహాన్ని ఆస్పత్రికి అందించేందుకు అంగీకారపత్రాన్ని ఇచ్చింది. 70 ఏళ్ల వయసులోనూ ఎంతో ఉత్సాహంగా ఆమె అందరినీ పలకరిస్తూ.. సాగిపోతుంది.

పరుగుల రాణి

- 1997లో ఖమ్మం జిల్లా కొత్తగూడెంలో జరిగిన ఏపీ వెటరన్ అమెచ్యూర్ అథ్లెటిక్ మీట్‌లో పాల్గొని వందమీటర్ల రిలే పరుగుపందెంలో ద్వితీయ స్థానం సాధించింది.
- 1998లో ఏలూరులో జరిగిన పోటీల్లో పసిడి పతకం సాధించింది.
- 1999లో పశ్చిమగోదావరి జిల్లాలో జరిగిన ఏపీ రాష్ట్ర వెటరన్ అమెచ్యూర్ అథ్లెటిక్ మీట్‌లో స్వర్ణం.
- 2000లో హైదరాబాద్‌లో జరిగిన ఓపెన్ వెటరన్ అథ్లెటిక్‌మీట్‌లో స్వర్ణం.
- 2001 వరంగల్ జిల్లా కాజీపేటలో జరిగిన పోటీల్లో 400 మీటర్ల పరుగుపందెంలో పసిడి పతకం సాధించింది.
- 2004–05 హైదరాబాద్, చెన్నైలలో జరిగిన జాతీయస్థాయి పరుగుపందెంలో ప్రథమ స్థానంలో నిలిచింది.
- 2007 జనవరిలో వరంగల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో స్వర్ణం.
- 2012 డిసెంబర్‌లో విశాఖపట్నంలో జరిగిన పరుగుపందెంలో ప్రథమ స్థానం.





మలేషియాలో జాతీయ పతాకంతో రామానుజమ్మ

బంగారు పతకాన్ని సాధించేదాన్ని



మలేషియాలో సాధించిన పతకాలతో టమటం రామానుజమ్మ

వయసు శరీరానికే కానీ, మనసుకు కాదని నమ్ముతాను. అందుకే పోటీలు ఎక్కడున్నా పట్టుబట్టి మరీ వెళ్తాను. పాస్‌పోర్టులో నా వయసు 50గా నమోదైంది. దీంతో నా వయసు 70 అయినా.. 50 ఏళ్లవాళ్లతో పోటీపడి పరుగుతీయాల్సి వచ్చింది. దీంతో నాకు మూడో స్థానంతో రజతం వచ్చింది. కానీ 70 ఏళ్ల వాళ్లతో పోటీపడితే బంగారు పతకం సాధించేదాన్ని. చిన్న పొరపాటు నాకు స్వర్ణాన్ని దూరం చేసింది. అయినా.. అంత దూరం వెళ్లి పతకం సాధించడం మరిచిపోలేని అనుభూతి. నాకు చిన్నప్పటి నుంచి ఆటలపై ఉన్న ఆసక్తితో పోటీల్లో పాల్గొంటున్నాను. నన్ను వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్న వారికి ధన్యవాదాలు.

– టమటం రామానుజమ్మ

ఎల్‌ఎండీకి నీటి విడుదల

బోయినపల్లి(చొప్పదండి): శ్రీ రాజరాజేశ్వర(మిడ్‌మానేరు) ప్రాజెక్టు నుంచి ఎల్‌ఎండీకి నీటి విడుదల చేశారు. శనివారం సాయంత్రం 6 గంటల వరకు ప్రాజెక్టు ఒక్క గేటు ద్వారా ఎల్‌ఎండీకి 500 క్యూసెక్కుల నీరు తరలుతోంది. మిడ్‌మానేరు ప్రాజెక్టులో 23.37 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



పర్శరాములు(ఫైల్)

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అనుపురం వద్ద కరీంనగర్–సిరిసిల్ల ప్రధాన రహదారిలో గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు. రుద్రవరం గ్రామానికి చెందిన పాముల పర్శరాములు(55) బైక్‌పై నాంపల్లికి వెళ్లి తిరిగి వస్తుండగా అనుపురం గ్రామం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య దుర్గవ్వ, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

5 కిలోల గంజాయి పట్టివేత



వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని వట్టెంల శివారులో 5 కిలోల గంజాయిని శనివారం పట్టుకున్నట్లు వేములవాడరూరల్ సీఐ కృష్ణకుమార్ తెలిపారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన కమిటి కారా అనే వ్యక్తి నుంచి ఈ గంజాయిని పట్టుకున్నట్లు వివరించారు. జగిత్యాల నుంచి వస్తున్న ఈ వ్యక్తి గంజాయి తీసుకొస్తున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారంతో తనిఖీలు నిర్వహించగా వట్టెంల శివారులో నిందితున్ని పట్టుకున్నామని తెలిపారు. డిప్యూటీ తహసీల్దార్ ముందు పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసిన కమిటి కారాను రిమాండ్‌కు తరలించామన్నారు.

ఉచిత ప్రయాణం.. అతివల ఆనందం



బస్సులో జీరో చార్జీతో ప్రయాణిస్తున్న మహిళలు

- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం
- సిరిసిల్లలో ప్రారంభించిన కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్లటౌన్/వేములవాడఅర్బన్: బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం ఎన్నికల హామీ. డిసెంబర్ 9 సోనియాగాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం శనివారం ప్రారంభించింది. సిరిసిల్లలో మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. చిన్నపిల్లలు, మహిళలు బస్సుల్లో జీరో టికెట్(డబ్బులు లేకుండా) ప్రయాణించారు. జిల్లా రవాణా శాఖాధికారి కొండల్‌రావు, సిరిసిల్ల డిపో మేనేజర్ మనోహర్ ఉచిత ప్రయాణాన్ని పర్యవేక్షించారు. బస్సుల్లో మహిళా ప్రయాణికులు కిక్కిరిసిపోవడంతో పురుషులు కొంత సమయం వేచిచూసి ఇతర బస్సుల్లో వెళ్లడం కనిపించింది. సిరిసిల్ల డిపోలో మొత్తంగా 66 బస్సులు ఉన్నాయి. ఇందులో సూపర్ లగ్జరీ(02), డీలక్స్(04) ఉండగా ఎక్స్‌ప్రెస్(36), పల్లెవెలుగు(24) ఉన్నాయి. ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగుల్లో మహిళలు, ఆడపిల్లలు, థర్డ్ జెండర్స్‌కు ప్రభుత్వం ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించింది. వేములవాడ డిపోలో సూపర్ లగ్జరీ బస్సులు 03, డీలక్స్ 12, ఎక్స్‌ప్రెస్‌లు 16, పల్లెవెలుగు 29, మినీబస్సులు 02 మొత్తంగా 62 బస్సులు ఉన్నాయి. ఇందులో ఎక్స్‌ప్రెస్‌లు 16, పల్లెవెలుగు 29, మినీబస్సులు 02 మొత్తం 47 బస్సులలో మహిళలు ఉచితంగా ప్రయాణం చేయనున్నారు.

బస్సుపాస్ తప్పుతుంది



రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో పల్లెల నుంచి పట్టణాలకు వెళ్లి చదువుకునే విద్యార్థినులకు మంచి అవకాశం. విద్యార్థినులకు ఇప్పటి నుంచి బస్సు పాస్ అవసరం లేదు.

– అఖిల, ఎంబీఏ విద్యార్థి వేములవాడ

సంతోషంగా ఉంది



రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అందించడం చాలా సంతోషంగా ఉంది. నేను వేములవాడ నుంచి సిద్దిపేటకు వెళ్తున్నాను. ప్రభుత్వం మహిళల కోసం ఈ ఆలోచన చేసి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం హ్యాపీగా ఉంది.

– మమత, వేములవాడ

చిరుద్యోగులకు వరం



ఉచిత ప్రయాణం మాలాంటి చిరుద్యోగులకు వరం. నేను రోజు కరీంనగర్ నుంచి సిరిసిల్లకు వచ్చి వెళ్తుంటాను. నాకు నెలకు రూ.6వేల వరకు ప్రయాణ ఖర్చులు అవుతాయి. ఉచిత ప్రయాణంతో ఆర్థికభారం తప్పుతుంది.

– టి.స్వాతి, ప్రైవేటు టీచర్, కరీంనగర్

బస్సుల సంఖ్య పెంచాలి



సిరిసిల్ల నుంచి హైదరాబాద్‌కు పోవాలంటే వేములవాడ నుంచి వచ్చే బస్సుల్లోనే వెళ్లాలి. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో సిరిసిల్ల, చుట్టుపక్కల గ్రామాలవారికి సీట్లు దొరకడం కష్టమే. సిరిసిల్ల నుంచి హైదరాబాద్‌కు బస్సుల సంఖ్య పెంచాలి. ఉచిత ప్రయాణం హర్షణీయం.

– చింతకింది శాంత, సిరిసిల్ల

ప్రయాణికుల సంఖ్య పెరిగింది



కొత్తగా అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ప్రారంభించడం శుభ పరిణామం. దీని ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య పెరుగుతుంది. ఉచిత ప్రయాణంపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నాం. అన్ని వయస్సుల మహిళలు సద్వినియోగం చేసుకోవాలి.

– పద్మ, కండక్టర్, సిరిసిల్ల

ప్రణాళికాబద్ధంగా అమలు



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకానికి అన్ని చర్యలు తీసుకున్నాం. డిపో పరిధిలోని నడిచే బస్సుల్లో అన్ని రకాల వయస్సు మహిళలకు జీరో టిక్కెట్లు ఇస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాలతో బస్సులను అన్ని రూట్లలో నడుపుతాం. ఈపథకం ద్వారా ఆక్యుపెన్సీ రేటు పెరిగే అవకాశం ఉంది.

– మనోహర్, డిపో మేనేజర్, సిరిసిల్ల

సిరిసిల్లలో కాంగ్రెస్ ఫ్లెక్సీల చించివేత

- పోలీసులకు ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల: కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని సిరిసిల్లలో ఏర్పాటు చేసిన ఆ పార్టీ ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు చించివేశారు. సోనియాగాంధీ పుట్టినరోజు శనివారం ఉండగా.. శుక్రవారం రాత్రి సిరిసిల్లలో కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే తెల్లవారే సరికి పలు చోట్ల ఉన్న ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు చింపేశారు. ఫ్లెక్సీలను చింపేయడం స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ విషయమై కాంగ్రెస్ నాయకులు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నాయకులు నాగుల సత్యనారాయణగౌడ్, చొప్పదండి ప్రకాశ్, వైద్య శివప్రసాద్, వెల్ముల తిరుపతిరెడ్డి ఎస్సై శ్రీనివాస్‌రావుకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాలను పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పసికందుల మృతి



వేములవాడలో రోదిస్తున్న కుటుంబ సభ్యులు

వేములవాడఅర్బన్: వైద్యుల నిర్లక్ష్యంతోనే పురిట్లోనే పసిపాప మృతిచెందిందని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబం తెలిపిన వివరాలు. బోయినపల్లి మండలం జగ్గారావుపల్లికి చెందిన తిప్పారవేణి అమూల్య మొదటి కాన్పు కోసం వేములవాడ ఏరియా ఆస్పత్రికి గురువారం వచ్చింది. వైద్యులు నార్మల్ డెలివరీ చేస్తామని చెప్పి.. శుక్రవారం రాత్రి ప్రసవం చేస్తుండగా పాప అడ్డం తిరిగింది. వెంటనే ఆపరేషన్ చేయగా అప్పటికే పాప మృతిచెందింది. ముందే ఆపరేషన్ చేయమంటే వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై ఆస్పత్రి సూపరింటెండెంట్ మహేశ్‌రావును వివరణ కోరగా.. నార్మల్ డెలివరీ కోసం అడ్మిట్ అయ్యారని, కాన్పు చేసే క్రమంలో పాప అడ్డం తిరగడంతో ఆపరేషన్ చేసినట్లు తెలిపారు. పాపను బతికించేందుకు ప్రయత్నించినా మృతిచెందిందని తెలిపారు.

సిరిసిల్ల సివిల్ ఆస్పత్రిలో నాలుగు రోజుల శిశువు..

సిరిసిల్లటౌన్: జిల్లా జనరల్ ఆస్పత్రిలో శనివారం ఉదయం నాలుగు రోజుల పసికందు మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం. ఎల్లారెడ్డిపేట మండలానికి చెందిన భాగ్యకు పురిటినొప్పులు రాగా కుటుంబ సభ్యులు డిసెంబర్ 5 సిరిసిల్ల జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆస్పత్రిలో పురుడుపోసుకోగా శనివారం తెల్లవారుజామున మృతిచెందింది. ఈవిషయమై ఆస్పత్రి సిబ్బందిని వివరణ కోరగా నెలలు నిండకముందే ప్రసవమైందని, తక్కువ బరువు పుట్టిందని తెలిపారు.

ఒక్కొక్కరుగా రాజీనామా!

- బీఆర్‌ఎస్‌కు రెండు పదవులు దూరం
- ఎమ్మెల్సీ పదవికి పాడి కౌశిక్‌రెడ్డి రాజీనామా
- వ్యవసాయ ముఖ్య సలహాదారు పోస్ట్ రద్దు చేసిన సీఎం
- గతంలోనే రాజీనామా చేసిన రవీందర్‌సింగ్, కుర్మాచలం అనిల్
- జీవన్‌రెడ్డి, సంజయ్, అర్వింద్ ఓడినా పదవుల్లోనే..



రాజీనామా సమర్పిస్తున్న పాడి కౌశిక్‌రెడ్డి



మాజీ సీఎంతో రమేశ్‌బాబు (ఫైల్)

సాక్షిప్రతినిధి,కరీంనగర్: ఉమ్మడి జిల్లాకు సంబంధించి బీఆర్‌ఎస్ మరో రెండు పదవులు కోల్పోయింది. ఇందులో ఒకటి మండలిస్థానం కాగా, మరొకటి నామినేటెడ్ పోస్టు కావడం గమనార్హం. హుజూరాబాద్ ఎమ్మెల్యేగా ఎన్నికైన పాడి కౌశిక్‌రెడ్డి తన ఎమ్మెల్సీ పదవికి శనివారం రాజీనామా చేశారు. ఈమేరకు తన రాజీనామాను మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి అందజేశారు. రాజీనామా సమర్పించడం కోసం తన ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారాన్ని వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. తన తండ్రి, మాజీ సీఎం కేసీఆర్‌కు శస్త్ర చికిత్స ఉన్న నేపథ్యంలో సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ కూడా ప్రమాణ స్వీకారం చేయలేదు. వీరిద్దరూ, బీజేపీ ఎమ్మెల్యేలతో కలిసి మరో తేదీన ప్రమాణ స్వీకారం చేస్తారని సమాచారం.

బీఆర్‌ఎస్‌కు మరో షాక్

అదే సమయంలో మధ్యాహ్నానికి ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్ పార్టీకి మరో షాక్ తగిలింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పలు కీలక విభాగాలలో నియమించుకున్న సలహాదారుల పోస్టులను రద్దు చేస్తూ తాజా సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సదరు జాబితాలో ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్న వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు కూడా ఉన్నారు. గతంలో పౌరసత్వ సమస్య ఉన్న కారణంగా ఆయనకు ఈ అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీపార్టీ టికెట్ నిరాకరించిన విషయం తెలిసిందే. అయితే, ఆయన అనుచరులను సంతృప్తి పరిచేందుకు, సేవలను పార్టీ వినియోగించుకునేందుకు కేబినెట్ హోదాకు సమానమైన వ్యవసాయశాఖ ముఖ్య సలహాదారుగా నియమించింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఇంతకాలం కంటితుడుపుగా ఉందనుకున్న పోస్టు కూడా తాజా ప్రభుత్వం నిర్ణయంతో దూరమైంది. ఇటీవల ఎన్నికల ఫలితాల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఓటమి చెందిన దరిమిలా సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ పదవికి సర్దార్ రవీందర్‌సింగ్, ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సీటుకు అనిల్ కుర్మాచలం రాజీనామా సమర్పించిన విషయం తెలిసిందే. దీంతో ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్ కోల్పోయిన పదవుల సంఖ్య నాలుగుకు చేరింది.

ఓడినా పదవుల్లో ఉండేది వీరే...

ఉమ్మడి జిల్లాలో అసెంబ్లీకి పోటీ చేసిన పలువురు స్థానికసంస్థలు, చట్టసభలకు ప్రాతినిధ్యం వహిస్తోన్న ప్రజాప్రతినిధులు ఓటమి చెందారు. వారిలో పాడి కౌశిక్‌రెడ్డి మినహా మిగిలిన వారంతా వారి పదవుల్లో కొనసాగనున్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, కోరుట్ల అభ్యర్థిగా ఓడిన నిజామాబాద్ ఎంపీ డి.అర్వింద్ ఎంపీలుగా కొనసాగనున్నారు. వీరిద్దరూ ఇప్పటికే ఎంపీలుగా తమ పని తాము చేసుకుపోతున్నారు. ఇక రామగుండం బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల సంధ్యారాణి జెడ్పీటీసీగా, మంథని ఎమ్మెల్యే అభ్యర్థిగా పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధు కొనసాగుతారు. జగిత్యాల కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డికి ఎమ్మెల్సీగా మరో ఏడాదిన్నర కాలముంది.

రాజన్న సన్నిధిలో భక్తుల రద్దీ

వేములవాడ: రాజన్నను శనివారం 15వేల మంది భక్తులు దర్శించుకున్నారు. సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఉదయం నుంచే తరలివచ్చారు. రాజన్నను రాష్ట్ర దేవాదాయశాఖ రీజినల్ జాయింట్ సెక్రటరీ రామకృష్ణ దంపతులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ ఆధ్వర్యంలో వేదోక్త ఆశీర్వచనం ఇచ్చి, ప్రసాదం అందించారు.



